


# ఎడారి

పొట్ల నారాయణమూర్తి రాజు

స్టౌ మీద డికాషన్ పడేసి. "నాన్న తయారై పోయుంటాడు" అనుకుంది కమల.

మధ్యాహ్నం పడుకుని లేచాక ముఖం కడుక్కోవడం అయిందికాదు. లెగ్గానే నాన్న పట్టుపంచె ఉతికి ఆరేసింది. గజ్జెలు తోమి శుభ్రంగా తెల్లగా తుడిచి పెట్టింది. చిడతలు మ్రోగుతున్నాయో లేదో ఒకసారి చూసింది. అవన్నీ అయే సరికి "టీ పెడతావా తల్లీ!" అన్నాడు తండ్రి. కిరసనాయిలు లేదు. ప్రక్కింటి వాళ్ళ దగ్గర పావుసీసాడు కిరసనాయిలు అప్పుతెచ్చి, ఉదయం టీ కవగా మిగిలిన కొంచెం పాలతో టీ తయారుచేసి తండ్రి కిచ్చి గుమ్మంముందు తలుపురెక్కకి ఆనుకుని నిలబడ్డది.

"ఏమ్మా నువ్వు తాగేవా?" లేదు. ఆ విషయం చెబితే తండ్రి తాగడు. గ్లాసునిండా టీ త్రాగడం తండ్రికలవాటు. కొంచెం టీతో మళ్ళీ తనకిస్తాడు. తను ఆకల్తో వెళ్తాడు.

"తాగేన్నాన్నా తాగేను..." గబుక్కున అన్నది. అబద్ధంకదూ అన్నట్టు తండ్రి కమలవైపు ఒకసారి చూసి టీని గడగడా తాగేసి తన ముస్తాబులో తను మునిగిపోయాడు.

"పంచె ఆరిపోయిందో లేదో చూడు," ఆ మాట తండ్రి అనడంతోనే లోనికెళ్ళి

గబుక్కున తెచ్చిచ్చింది ఇందాక తను ఉతికి ఆరేసిన పట్టుపంచె.

పొడి పొడిగా ఆరింది పంచె.

"అయినా పర్వాలేదు వంటిమీద, వెళ్ళేలోపల ఆరిపోతుందిలే ఇదేసు కోకపోతే కథ చెప్పినట్టు వుండదమ్మా.. దీని కెంతవయసో చెప్పలేనుగానీ, నాతో పాటు వచ్చి ఎన్నికథలు విన్నదో వెర్రి ముండ " ఆ పంచెను ఒకసారి ముద్దు పెట్టుకుని అన్నాడు తండ్రి.

అవును.

నాన్నకు ఆ పట్టుపంచెకు విడరాని సంబంధం వుంది. తనకు వూహ తెల్సి నప్పటినుంచీ చూస్తున్నది. ఏ కథకు నాన్న ఎక్కడకెళ్ళినా ఆ పట్టుపంచె కట్టుకుని వెళ్తాడు. కథనుంచి రాగానే విప్పేసి అతిభద్రంగా దాస్తాడు. మాసి పోయినా ఉతకడానికి సమయం లేక పోయినాఆ పంచే కట్టుకుని వెళ్తాడు నాన్న.

"కథ ఎన్నిగంటలకు నాన్నా " అడిగింది కమల. దానికి తండ్రి సమా ధానం చెప్పలేదు. పాత చిరుగులపంచె విప్పేసి ఎర్రని జల్తారుఅంచు పట్టుపంచె కట్టుకున్నాడు. జరీ అంచు కండువా చిరుగులు కనబడకుండా సర్ది పైన వేసు కున్నాడు.

"తెల్లగా ఎలా మెరుస్తున్నాయో " అని సంతోషంతో కూతుర్ని చూసి గజ్జెలు కట్టుకుని 'ఘల్లు ఘల్లు' మని నేలమీద కాలుకొట్టి చిడతలు చేతిలో పెట్టుకుని ఒకసారి అద్దంలో తనని తాను చూసు కున్నాడు. చూసుకున్నాక కూతురివేపు చూసాడు.

కమల నవ్వింది. ఏవనాలో తెలీక.

తన జీవితంలో ఇలాటి సంఘటనలు చాలా వున్నాయి.

నాన్న. పేరుమోసిన హరికథకుడు. జీవితాంతం హరికథల్ని నమ్మి, హరి కథలకోసమే బ్రతుకుతున్న భక్తుడు. బ్రతుకులో అంతకన్నా పరమార్థం వేరేమీలేదు. ఒక్కగానొక్క కూతురు తప్పితే ఏ బంధమూలేదు ఆయనకు.

కమలది వాళ్ళమ్మ పోలిక. సన్నగా పొడవుగా వుంటుంది. ఆ అమ్మాయి ఏ భావాన్నైనా కళ్ళతో చెప్తుంది. చురుకు పాలెక్కువ. ముందు చూపు కూడా ఎక్కువే. ఆ అమ్మాయికి చదువుకోవా లనే వుత్సాహం వుంది. కానీ పదోతర గతి వరకూ చదివేసరికి, తనని ఎన్ని కష్టాలుపడి తండ్రి చదివించాడో అర్థం చేసుకుంది. పదవతరగతి మంచి మార్కులతోనే పాసైంది.

"నీకు మంచి మార్కులే వచ్చాయి. నా తల్లి చదువుల సరస్వతి ఇంటరు అప్లికేషను పెడతావా " అడిగాడు మార్కులపట్టీ చూసి.

"వద్దు నాన్నా " అంది రక్కున.

తండ్రి ఆశ్చర్యపోయాడు.

"చదువమ్మా నా కొడుకువైనా, కూతురువైనా నువ్వే నా కష్టం తగ్గి



ద్దావని నువ్వేమీ మానేకు నా కష్టం నాకున్నదే ఇది నాకు కష్టంకూడా కాదు అంతా భగవత్సేవ అంచేత నిన్ను డాక్టరుచేస్తానని మీ అమ్మకు మాటిచ్చాను." అని అన్నాడాయన పొడవాటి పాతకాలం కుర్చీమీద కాళ్ళు జాపుకుంటూ.

తండ్రి పేరున్న హరికధకుడే ఐతే మాత్రం ఇదేం గవర్నమెంటు ఉద్యోగమా, నెలయ్యేసరికి టక్కున డబ్బులు చేతిలో వాలడానికి. ఒక మాసం అధికం, ఇంకో మాసం అనావృష్టి. లేందానికి, వున్నదానికి అన్నిటికీ ఖర్చులు. ఎక్కణ్ణుంచి తెస్తాడు తండ్రి.

డాక్టరు.

అవును అమ్మకు డాక్టరు చదువంటే

ఎంతో ఇష్టం. అమ్మకు ఒంట్లో బాగు లేనపుడు కామోసు ఒకసారి తను అమ్మతోపాటు విశాఖపట్నం పెద్దాసు పత్రికి వెళ్ళింది.

చకచకా అమ్మాయిలు, అబ్బాయిలు తెల్లటి దుస్తులు వేసుకుని నడుస్తుంటే "ఎవరు నాన్నా వీళ్ళందరు" అని తండ్రిని తను అడగడం జ్ఞాపకం వుంది.

"వీళ్ళు డాక్టర్లే రెండు మూడు నెలల్లో అవుతారు " అన్నాడు తండ్రి.

డాక్టరు ఐతే చాలా బాగుంటుంది. కానీ ఖర్చు. వేలకు వేలు ఖర్చు. మామూలుగానే ఇల్లు గడవడం కష్టంగా వుంది. నాన్న ఆరోగ్యంకూడా క్షీణించి పోయింది.

ఇప్పుడు నాన్నని బాధపెట్టగూడదు.

"వీణ నేర్చుకుంటా న్నానా " అన్నది. తండ్రి ఒక్కసారి తల తిప్పి స్తంభంపక్క నించున్న కమలవైపు చూసి "వద్దమ్మా ఆ సంగీతపు చదువు వొద్దు గాత్రం, నాట్యం నేర్చుకుని నేను బాగు పడ్డాను నువ్వు బావుకోడానికి తల్లీ వద్దు వద్దు పల్లి . వాటిజోలికి మళ్ళీ వెళ్ళొద్దు " తండ్రి తల అటు తిప్పేసు కున్నాడు.

"నే నెప్పుణ్ణుంచో అనుకుంటుండే దాన్ని పదోతరగతి అయ్యాక వీణ నేర్చుకుందామని అది నాకు ఇష్టం నేర్చుకుంటా న్నానా " గోముగా అడిగింది.

తండ్రి ఔననలేదు. కాదనలేదు.

కానీ మౌనం అంగీకారం కదా.

"ఏఁవమ్మా, ఏఁవిటాలోచిస్తున్నావు." తండ్రి మాటతో ఆలోచన్లోంచి బైట కొచ్చింది కమల. అప్పటికే తండ్రి నుదుట విభూది రేఖలు పెట్టుకుని, కుండలాలు ఒకసారి సరిచూసుకుని, నుదుటన గుండ్రంగా ఎర్రటి బొట్టును దిద్దుకుంటున్నాడు.

"నేను కథకు వెళ్తే వక్కత్తివీ వుంటాఁవేమో రాకూడదూ కథ విందూగాని రుక్మిణీ కళ్యాణం అది భట్లవారు వ్రాసింది ...ఎంత రమ్యంగా వుంటుందనుకున్నావ్ "

కమల ఏం మాట్లాడలేదు.

"ఇవాళ ఆఖ్రరోజుకూడా. రా విందూగాని " తండ్రి ఏ కథనైనా గొప్పగా చెప్తాడు. కథచెప్తే మళ్ళీ మళ్ళీ వినాలని పిస్తుంది. కానీ ఇవాళ ఎందుకో వెళ్ళాలని పించటంలేదు.

తండ్రి పాంకోళ్ళు వేసుకున్నాడు.

తండ్రి వెళ్ళేముందు అకస్మాత్తుగా కమలకు ఓ విషయం జ్ఞాపకంవచ్చింది.

"నాన్నా " గబుక్కున పిల్చింది.

"ఏమ్మా" నవ్వుతూ చూసాడాయన.

ముఖ్యమైన విషయం జ్ఞాపకం వచ్చింది. కానీ చెప్పదల్చుకోలేదు.

"ఏంలేదు నాన్నా ఏంలేదు " తనలో తాను అనుకున్నట్లుగా తండ్రితో అన్నది.

"పిచ్చిపిల్ల" అభిమానంగా అని నవ్వుతూ వీధిలోనికి నడిచాడాయన.

తండ్రి వెళ్ళిపోయాక కమల అలా చాలాసేపు వరండాలో స్తంభానికానుకుని కూర్చుండిపోయింది.

ఆ అమ్మాయి తలనిండా ఏవో ఆలోచనలు. అన్నీ తండ్రి గురించే.

చీకటి పడింది.

బుడ్డీదీపాన్ని వెలిగించి పోతన ప్రహ్లాదచరిత్ర ఒకసారి చదవాలనిపించి చదివింది. విష్ణుభక్తిగురించి పోతన చెప్పిన పద్యాలు చదివి, చదివి అలిసిపోయి గుండెమీద ఆ పుస్తకాన్ని అలా పెట్టుకుని నిద్రపోయింది.

ఎంతసేపు నిద్రపోయిందో తెలీలేదు. ఏదో చప్పుడైతే గబుక్కున తెలివొచ్చింది. వంటింట్లో చప్పుడికి విసుక్కుంటూ గదిలోకెళ్ళి చూసింది.

పిల్లులు.

తరిమేసి నాన్న వచ్చేసరికి వంట చెయ్యాలని జ్ఞాపకంవచ్చి తనని తానే తిట్టుకుంది.

చేటతీసుకుని బియ్యంకోసం డబ్బా మూత తీసింది.

బియ్యం లేవు.

* * *

రాత్రి పదయింది.

హరికథ చెప్పి తండ్రి హుషారుగా ఇంట్లోకి వచ్చాడు.

"అమ్మా కమలా కథ ఎంత బాగా జరిగిందనుకున్నావ్" అని పలకరించాడు కూతుర్ని.

ఆ మాటకేం జవాబు చెప్పలేదు కమల.

కాళ్ళ గజ్జెలు విప్పుకుని, పట్టుపంచె విడిచి మామూలు అంగవస్త్రం పట్టుకుని కుర్చీలో కూర్చుని చిల్లర లెక్కపెడుతున్నాడు తండ్రి.

ఆ చిల్లర ఆవేళ దక్షిణ పళ్ళెంలో వచ్చింది.

"ఈ వేళ్టితో కథ ఆఖరు కదా నాన్నా" అన్నది కమల.

"అవును" అన్నాడు తండ్రి. మళ్ళీ ఆయనే "కథ నువ్వింటే బాగుండేది. శ్రోతలు ఎంత బాగా మెచ్చుకున్నారనుకున్నావు జనం ఎలా వచ్చారనుకున్నావు హరికథ చచ్చిపోలేదు కథకు విలువుంది తల్లీ విలువుంది ఈ కలియుగంలో కూడా భక్తులున్నారు దేవుడున్నాడు నిజంగా వున్నాడు" ఆయన ఏం చెబుతున్నాడో అన్నీ విన్నది.

కథ ఎలా జరిగిందో, ఎంత రసవత్తరంగా తను చెప్పాడో అన్నీ మళ్ళీ వివరించి చెప్పాడు.

"భగవత్సేవ ప్రతిఫలం ఆశించకూడదు అయినా ఏదో కొంతలో కొంత సంతృప్తి" అని "ఇదిగో చూడు ఈ చిల్లర లెక్కపెట్టు"

అని గావాంచాకి కట్టిన చిల్లర విప్పి కూతురు ముందుంచాడు.

పైసా రెండు పైసలు మూడు పైసల బిళ్ళలు...అంతా లెక్క పెట్టింది. నాలుగు రూపాయల అరవై పైసలు. అంతే.

కమలకు ఏంచెయ్యాలో తెలీలేదు. ఆ సమయంలో ఆ అమ్మాయి చిన్నారి మనసులో ఏ బాధ మెదిలిందో తెలీదు.

"అమ్మాయ్ ఆకలేస్తోంది అన్నం పెట్టు" ఆ ప్రశ్నకు ఉలిక్కి పడింది కమల.

సమాధానం చెప్పలేదు.

మళ్ళీ తండ్రి రెండోసారి అడిగాడు. అప్పుడు మెల్లగా పెదవి విప్పి చెప్పింది కమల.

"నాన్నా మధ్యాహ్నమే బియ్యం నిండుకున్నాయి" ఎలా చెప్పిందో తెలీదు. ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లోంచి ఉబికిన కన్నీళ్ళను తండ్రి చూడకుండా తుడుచుకుంది.

"అలాగా" అన్న ఒక్క మాట మాత్రం అనగలిగాడు తండ్రి.

అప్పటికే అక్కడ చీకటి దట్టంగా దరిద్రంలా నిండుకుంది. అలా ఎంత సేపు గడిచిందో తెలీలేదు.

"ఆ చిల్లర ఇలా ఇవ్వు తల్లీ" అన్నమాట విని స్తంభానికి చేరబడి కునుకుపాట్లు పడుతున్న కమల చిల్లర డబ్బులు తీసి తండ్రికిచ్చింది.

"పస్తు పడుకుంటామా పైడితల్లి కొట్టుకెళ్ళి రొట్టో అరటిపళ్ళో తెస్తానుండు" అని తండ్రి లేచి బట్టలు వేసుకుని బైటకు వెళ్ళాడు.

ఆయన వెళ్ళిన వైపు అలా చూస్తూ లేచి నిలబడింది కమల. ఆ సమయంలో ఆ అమ్మాయి సాయంత్రం తండ్రి వెళ్తున్నప్పుడు బియ్యం నిండుకున్నాయన్న సంగతి ఎందుకు చెప్పలేక పోయిందో, జ్ఞాపకం వచ్చి, ఏదో తెలియని బాధ మనసులో గుండుసూదులు గుచ్చినట్టయి, మూగగా ఏడ్చింది.

ఆమె కళ్ళంట టప్, టప్మని కారిన కన్నీటి బొట్లు బుడ్డిదీపం వెలుగులో మిణుగురు పురుగుల్లా మెరిసాయి.

---